క్లుప్తంగా

పుణ్యక్షేత్రాల సందర్శనకు ప్రత్యేక బస్సు

మధిర: మధిర నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం ఈనెల 26న ప్రత్యేక బస్ ఏర్పాటు చేస్తున్నట్లు మధిర డిపో మేనేజర్ తెలిపారు. ఈనెల 26న తెల్లవారుజామున 2–30 గంటలకు బయలుదేరే డీలక్స్ బస్సు అంతర్వేదిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, వాడపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి తదితర ఆలయాల సందర్శన అనంతరం తిరిగి మరుసటి రోజు తెల్లవారుజామున ఒంటి గంటకు మధిర కు వస్తుందని వెల్లడించారు. పెద్దలకు రూ.1,150, పిల్లలకు రూ.600 టికెట్ ధర నిర్ణయించగా, వివరాలకు 99592 25961, 94913 57479 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రైతులకు రుణాలు పంపిణీ



రుణాలు అందిస్తున్న మేనేజర్ దివ్య, చైర్మన్ శ్రీనివాసరావు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని సొసైటీకి చెందిన 42మంది రైతులకు రూ.35లక్షలు మంజూరయ్యాయని సొసైటీ చైర్మన్ ములుగూరి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం డీసీసీబీ బ్యాంక్‌లో జరిగిన కార్యక్రమంలో రైతులకు ఆ రుణాల చెక్కలను బ్యాంక్ మేనేజర్ దివ్యతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కడియం శ్రీనివాసరావు, క్యాషియర్ జానీ, సొసైటీ సీఈఓ ఏసుబాబు, పలువురు సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



భట్టి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్న బీఆర్ఎస్ నాయకులు

కారేపల్లి: మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం బోనకల్ మండలంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సొసైటీ డైరెక్టర్ అడపా పుల్లారావు, మాణిక్యారం మాజీ సర్పంచ్ భూక్యా రంగారావు, దుబ్బతండా మాజీ సర్పంచ్ ఆంగోతు మత్రు, నాయకుడు శంకర్ పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఆవిష్కరణ

తల్లాడ: మండలంలోని రెడ్డిగూడెంలో సోమవారం బీజేపీ మండలాధ్యక్షుడు చల్లా నాగులు ఆ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవీ రమేష్ మాట్లాడారు. బీజేపీని బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ కృష్ణారావు, మండల కార్యదర్శి కిరణ్, రమేష్, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, శారద పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే అమరులకు ఇచ్చే నివాళి

కొణిజర్ల: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో సీపీఐ అభ్యర్థులను గెలిపించడమే అమరవీరులకు ఇచ్చే ఘనమైన నివాళి అని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు యర్రా బాబు, దొండపాటి రమేష్ అన్నారు. సోమవారం కొణిజర్లలో నిర్వహించిన మాజీ సర్పంచ్, సీపీఐ సీనియర్ నాయకుడు బండారు హన్మంతు 5వ వర్ధంతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఐ మండల కార్యదర్శి భాస్కర్, సహాయ కార్యదర్శులు స్వర్ణరమేష్, కోటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

శంకుస్థాపన

ముదిగొండ: పీపుల్స్ మార్చ్ పేరిట నాటి ప్రతిపక్షనేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన 1,364కి.మీ పాదయాత్రకు గుర్తుగా మండలంలోని వెంకటాపురంలో పైలాన్ నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు సోమవారం శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ మండల నాయకుడు గుడిపూడి బుచ్చిరామయ్య, జాన్సీరాణి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రమేష్, మాజీ జెడ్పీటీసీలు పసుపులేటి దేవేంద్రం, నాగేశ్వరరావు, జోన్ ఇన్‌చార్జ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

'బడి'లో మందుబాబుల ఇష్టారాజ్యం

- రాత్రి వేళ అడ్డాగా మార్చుకుని వీరంగం
- ప్రహరీ లేకపోవడంతో పశువుల రాకపోకలు కూడా..
- సమస్యల నిలయంగా బాజుమల్లాయిగూడెం హైస్కూల్



స్కూల్ ఆవరణలో మద్యం సీసాలను గ్రామస్తులకు చూపిస్తున్న హెచ్ఎం వేణుమాధవ్ (ఫైల్)

కారేపల్లి: కొందరు మందుబాబుల నిర్వాహకంతో సరస్వతి నిలయం కాస్తా నిషాలయంగా మారింది. మండలంలోని బాజుమల్లాయిగూడెం హైస్కూల్‌కు ప్రహరీ లేకపోవడంతో మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రివేళ మందుబాబులు భవనాల కారిడార్‌లోనే కాక క్రీడా మైదానంలో మద్యం సేవిస్తూ అక్కడే సీసాలు పడేస్తున్నారు. దీంతో ఉదయం స్కూల్‌కు వచ్చే ఉపాధ్యాయులు సీసాలన్నీ తీసివేయించాక విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి నెలకొంది. ఇక క్రీడా మైదానంలో సీసాల కారణంగా విద్యార్థులకు ఎప్పుడేం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది.

ప్రహరీ లేకపోవడంతో...

బాజుమల్లాయిగూడెం హైస్కూల్‌లో 6నుంచి 10వ తరగతి వరకు 86మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాల 40ఏళ్ల క్రితమే ఏర్పాటు కాగా, ఐదెకరాల విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణం సైతం ఉంది. అయితే, క్రీడా మైదానానికి ఓవైపు మాత్రమే ప్రహరీ ఉండడంతో రాత్రివేళ మందుబాబులు సులభంగా ప్రవేశిస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగి సీసాలు వేసి వెళ్తున్నారు. అంతేకాక మత్తులో పాఠశాల తలుపులు, కిటికీలు ధ్వంసం చేయడం, స్కూల్ సామగ్రి చోరీ చేయడం పరిపాటిగా మారింది. ఇంకోపక్క ప్రహరీ లేని కారణంగా పశువులు సైతం పాఠశాలలోకి ప్రవేశించి మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి.

అధికారులకు ఫిర్యాదు చేసినా..

ఎందరినో ఉన్నతులుగా తీర్చిదిద్దిన బాజుమల్లాయిగూడెం హైస్కూల్‌ను గత ఏడాది ఏప్రిల్ 23వ తేదీన అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈక్రమాన పాఠశాలలో సమస్యలు, మందుబాబుల ఆగడాలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఫిర్యాదు చేశారు. ఆపై అదనపు కలెక్టర్ సూచనలతో సింగరేణి తహసీల్దార్‌కు సైతం వినతిపత్రం అందజేశారు. అయినా ప్రహరీ నిర్మించకపోగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం మందుబాబులకు అడ్డుకట్ట పడడం లేదు.

ఆనాటి గురువుల ఆవేదన..

బాజుమల్లాయిగూడెం హైస్కూల్‌లో 1986లో పదో తరగతి పూర్తిచేసిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఇటీవల జరిగింది. ఈ కార్యక్రమానికి ఆనాటి ఉపాధ్యాయులు కూడా హాజరుకాగా విశ్రాంత ఉపాధ్యాయులు ఉపేందర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పాఠశాల సమస్యలతో పాటు క్రీడా మైదానం దుస్థితిని చూసి చలించిపోయారు. మందుబాబుల ఆగడాలు, అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకునేలా గ్రామ పెద్దలు ముందుకు రావాలని కోరారు. దీనికి తోడు అధికారులు కూడా స్పందించి ప్రహరీ నిర్మించి గేట్లు ఏర్పాటు చేస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని స్థానికులు చెబుతున్నారు.

ఆడాలంటే భయం..



మైదానంలో ఆడడానికి వెళ్లాలంటే భయమేస్తోంది. గ్రౌండ్‌లో ఎక్కడపడితే మద్యం సీసాలు, సీసా ముక్కలు ఉండడంతో కొందరికి గాయాలయ్యాయి. పశువులు కూడా వచ్చి మొక్కలను తింటున్నాయి. ప్రహరీ నిర్మించి గేట్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– సాయిప్రణయ్, 10వ తరగతి విద్యార్థి

మా స్కూల్‌ను పట్టించుకోవాలి..



మా పాఠశాలకు ఫెన్సింగ్ లేదా ప్రహరీ నిర్మించాలి. ఇవేమీ లేక పాఠశాల వరండాలో రాళ్లు, మద్యం సీసాలు కనిపిస్తున్నాయి. రాళ్లతో తలుపులు, కిటికీలను కొట్టి పాడు చేస్తున్నారు. అధికారులు మా స్కూల్ సమస్యలపై స్పందించి పరిష్కరించాలి.

– దినేష్, 10వ తరగతి విద్యార్థి

ఉన్నతాధికారులకు విన్నవించాం..



ప్రహరీ నిర్మించాలని అధికారులకు విన్నవించాం. మందుబాబులు స్కూల్ కారిడాల్, మైదానంలోకి వచ్చి మద్యం తాగి సీసాలు పడేస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామపెద్దలకు కూడా చెప్పాం. ప్రహరీ నిర్మించి గేట్లు ఏర్పాటు చేస్తేనే సమస్య పరిష్కారమవుతుంది.

– వేణుమాధవ్, హెచ్ఎం, బాజుమల్లాయిగూడెం హైస్కూల్

ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదు

వైరా: ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. వైరా మున్సిపాలిటీలోని 14వ వార్డుకు చెందిన యువకుడు కట్ల నాగరాజు.. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన తల్లి పేరు లేదని మనస్తాపంతో వైరా ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఆస్పత్రికి తరలించారు. దీంతో ఆయనను ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఫోన్‌లో నాగరాజుతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లప్రక్రియ అనేది నిరంతరం జరిగేదని, ఇందిరమ్మ ఇల్లు ఇప్పించే ఏర్పాటు తప్పక చేస్తానని హామీ ఇచ్చారు. బాధితుడి వివరాలు సేకరించాలని స్థానిక నాయకులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా వైద్య ఖర్చుల నిమిత్తం యువజన



నాగరాజుతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్, పరామర్శిస్తున్న పీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, నాయకులు

కాంగ్రెస్ నాయకుడు కట్ల సంతోష్ రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కట్ల నాగరాజు, సయ్యద్ అన్వర్, రాము, ముదిగొండ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

25నుంచి శ్రావణమాస ఉత్సవాలు

మధిర: మధిరలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈనెల 25నుంచి శ్రావణమాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కపిలవాయి జగన్ మోహన్‌రావు తెలిపారు. శ్రావణమాసంలో ఐదుసార్లు శుక్రవారాలు వస్తున్నందున ప్రతీ శుక్రవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు నిర్వహిస్తామని వెల్లడించారు. అలాగే, ఆగస్టు 8న అమ్మవారికి కుంకుమ పూజ, వరలక్ష్మీ వ్రతం, 9న రాఖీ పండుగ సందర్భంగా పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

ఖర్గే జన్మదిన వేడుకలు

సత్తుపల్లిటౌన్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తోట సుజలరాణి, ఎండి కమల్‌పాషా, దోమ ఆనంద్, పింగళి సామేలు, నారాయణవరపు శ్రీనివాస్, గాదె చెన్నారావు, అలవాల కరుణాకర్, సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.

నివాళి..

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు చేబ్రోలు ఇంద్రసేన భార్య వీరమణి (30) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అదే విధంగా సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జితేందర్‌రెడ్డి, నాయకులు నివాళులర్పించారు.

క్రైం కార్నర్

కేసు నమోదు

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి గ్రామంలో దాసరి శ్రీధర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా కొంతమంది వ్యక్తులతో కలిసి మద్యం సేవించి అసభ్యకరమైన పాటలు పెట్టుకుని రోడ్డుపై డాన్స్ వేస్తూ గొడవ చేశారని స్థానికులతో కలిసి బత్తుల భరత్‌కుమార్ ఏమిటని ప్రశ్నించగా వారిని దుర్భాషలాడుతూ చంపుతామని బెదిరించారు. దీంతో పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేయగా.. పది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ టి.శ్రీహరి తెలిపారు.

పత్తి చేను ధ్వంసం

బోనకల్: మండలంలోని ముష్టికుంట్లకు చెందిన షేక్ మీరాసాహెబ్ సాగు చేస్తున్న పత్తిచేనును అయన తమ్ముడు జానీమియా ధ్వంసం చేశాడు. అన్నదమ్ములకు పొలం విషయంలో వివాదం జరుగుతుండగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆపై పెద్దల సమక్షాన రాజీ చేసుకున్నా రిజిస్ట్రేషన్ విషయంలో జాప్యం జరుగుతోంది. దీంతో మీరాసాహెబ్ సాగుచేసిన పత్తి చేనును జానీమియా ధ్వంసం చేసినట్లు సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు.

యువతి అదృశ్యం

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఓ యువతి కనరాకుండా పోవడంతో ఆమె కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. గతంలో ఆమెను గ్రామానికే చెందిన ఓ యువకుడు వేధిస్తుండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఇప్పుడు తమ కుమార్తె కానరాకుండా పోవడానికి ఆయనే కారణమనే అనుమానాన్ని కుటుంబీకులు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు



బాణాపురంలో ఆందోళన చేస్తున్న స్థానికులు

ముదిగొండ: మండలంలోని బాణాపురంలో ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో శీలం ఉపేందర్‌రావుకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన శీలం ఉపేందర్‌రావు నేలకొండపల్లి మండలం మంగాపురంతండాలో ఆదివారం సుతారి పనికి వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. బాణాపురంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఖమ్మం నుంచి వస్తున్న కారు డ్రైవర్ అతివేగంగా ఢీకొట్టాడు. దీంతో ఉపేందర్‌రావుకు తీవ్రగాయాలు కాగా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఆయన భార్య సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని సీఐ ఓ.మురళి తెలిపారు. కాగా, ఉపేందర్‌రావు కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం బాణాపురం – వల్లబి రోడ్డుపై కుటుంబీకులు, బంధువులు ఆందోళన నిర్వహించారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోగా పోలీసులు వారికి సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు.

రుద్రాక్షపల్లిలో బోనాల వేడుకలు



రుద్రాక్షపల్లిలో బోనాలతో వస్తున్న ఎమ్మెల్యే రాగమయి, మహిళలు

సత్తుపల్లిరూరల్: బోనాల వేడుకలను సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి బోనమెత్తుకొని స్థానికులతో కలిసి ఊరేగింపులో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కారేపల్లి వెంకటసాయినగర్‌లో..

కారేపల్లి: కారేపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీముత్యాలమ్మ తల్లికి శ్రీవెంకటసాయినగర్ కాలనీ మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు చాందావత్ లక్ష్మణ్, కర్ణ, రాంబాబు, నాగేశ్వరరావు, శంకర్, లక్ష్మణ్, సర్వన్, నాగేష్, ఈశ్వర్, శివ, సర్వన్, వీరూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వచ్చాకే కల్లూరు అభివృద్ధి

కల్లూరురూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి నేతృత్వాన కల్లూరు అభివృద్ధి జరిగిందని, ఈ విషయంలో చర్చకు సిద్ధమని కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు. కల్లూరులో సోమవారం మార్కెట్ చైర్‌పర్సన్ భాగం నీరజాదేవి, నాయకులు లక్కినేని కృష్ణ, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఏనుగు సత్యంబాబు, పెద్దబోయిన శ్రీనివాసరావు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయని అభివృద్ధిని ఎమ్మెల్యే రాగమయి రెండేళ్లలో చేసి చూపించారన్నారు. కల్లూరును మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయించడమే కాక అభివృద్ధి పనులకు రూ.15 కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. అలాగే, మండలంలోని చెన్నూరులో రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం జరగనుందని చెప్పారు. ఈ విషయంలో



మాట్లాడుతున్న మార్కెట్ చైర్‌పర్సన్ నీరజాదేవి, నాయకులు

తప్పుడు ఆరోపణలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు చర్చకు రావాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు తక్కెళ్లపల్లి దుర్గాప్రసాద్, మాదిరాజు అన్నమరాజు, భూక్య శివనాయక్, ఆళ్లకుంట నర్సింహారావు, ఎస్.కే.తురాబ్ అలీ, ఎస్.కే.ఉస్మాన్, బైర్ల కాంతారావు, నోటికి కృష్ణారెడ్డి, మట్టా రామకృష్ణ, కొర్రా నర్సింహ, పరిమి భరత్, కెవిఆర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మాజీ ఎమ్మెల్యే సండ్ర పర్యటన

సత్తుపల్లి/తల్లాడ/కల్లూరురూరల్: సత్తుపల్లి, తల్లాడ, కల్లూరు మండలాల్లో సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సోమవారం పర్యటించారు. సత్తుపల్లిలోని వివిధ ప్రాంతాల్లో మృతి చెందిన ఎస్.కే.మస్తాన్, మట్టా ప్రసాద్‌తో పాటు తల్లాడ మండలం అంజనాపురం, ముద్దునూరులో ఇటీవల మృతి చెందిన గోసు నాగరత్నం, ఇనుపనూరి పుష్పమ్మ కుటుంబాలను పరామర్శించారు. అలాగే, కల్లూరు మండలం ముచ్చవరంలో మృతి చెందిన మాజీ సర్పంచ్ గంగవరపు సూర్యనారాయణ మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఈకార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్, నాయకులు కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఎస్.కే.చాంద్‌పాషా, వీరమోహన్‌రెడ్డి, రామిరెడ్డి, చలపతిరావు, అజయ్‌కుమార్, రఘు పాల్గొన్నారు.

మీ సేవా ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ముల్లపాటి



ముళ్లపాటి సీతారాములును సత్కరిస్తున్న మీసేవా ఆపరేటర్లు, నాయకులు

వైరా: ఖమ్మం జిల్లా మీ సేవా ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వైరా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు ఎన్నికయ్యారు. సోమవారం ఖమ్మంలోని టీఎంఓఏ (తెలంగాణ మీసేవా ఆపరేటర్ల అసోసియేషన్) కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల జీవన్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో సీతారాములును ఏకగ్రీవంగా ఎన్నుకోగా.. పలువురు అభినందించారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా దండు



దండు ఆదినారాయణ

సత్తుపల్లి: సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా సత్తుపల్లికి చెందిన దండు ఆదినారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 19, 20వ తేదీల్లో మధిరలో జరిగిన సీపీఐ 23వ జిల్లా మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో పార్టీ విస్తరణ, ప్రజా సంఘాల నిర్మాణం, అనేక పోరాటాలు నిర్వహిస్తున్న దండు ఆదినారాయణను జిల్లా కార్యవర్గంలోకి తీసుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ నూతన కార్యవర్గం

కల్లూరురూరల్: మండలంలోని ఎర్రబోయినపల్లి గ్రామ పంచాయతీ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆదేశాల మేరకు సీనియర్ నాయకుల సమక్షంలో ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఏగుపాటి రాంబాబు, ఉపాధ్యక్షులుగా బీరవెల్లి రవి, నేరేళ్ల రాము, ప్రధాన కార్యదర్శులుగా నల్లగట్ల సత్యానందం, కులపోగు కృష్ణ, కోశాధికారిగా కోట నాగరాజుతో పాటు మరో 20మంది కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.

ఫాదర్స్ ఫెలోషిప్ నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు దైవస్వరూపి ప్రార్థనా మందిరంలో సోమవారం ఫాదర్ పాపకంటి రాజారత్నం అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఫాదర్ల ఫెలోషిప్ మధిర నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ నూతన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మొండ్రు చెన్నయ్య, వై.డేవిడ్, ఉపాధ్యక్షుడిగా జానయ్య, కోశాధికారిగా మాధవరావు, జాయింట్ సెక్రటరీగా సురేష్‌వారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉచిత షుగర్ పరీక్షలు

వైరా: వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైరాలోని 13వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బుచ్చిరామారావు, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కోడ్ సతీష్‌కుమార్ ఉచితంగా షుగర్ మందులు పంపిణీ చేశారు. పలువురు పాల్గొన్నారు.

సాయిస్ఫూర్తి విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లి: బీటెక్ ఫైనలియన్ పరీక్షా ఫలితాల్లో గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఊటుకూరి శేషారత్నకుమారి తెలిపారు. ట్రిపుల్ ఈలో వి.అనూష, ఎస్.హేమమాలవిక, మెకానికల్ ఇంజనీరింగ్‌లో మోక్షిత్, స్వాతి, ఈసీఈలో నవ్య, శ్రావణి, స్వాతి, చంద్రిక, సీఎస్ఈలో అభినయ, ప్రణయకుమార్, ఎస్ఎస్ఎంలో నవ్య, కీర్తి ప్రియ, బేబీషాలిని ఉత్తమ ఫలితాలు సాధించడంతో.. కళాశాల చైర్మన్ బండి పార్థసారధిరెడ్డి, ట్రస్టీ బండి అన్విదలు వర్చువల్‌గా అభినందించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎర్రుపాలెం: వ్యవసాయ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాధాకృష్ణ అన్నారు. సోమవారం జమలాపురం, కంద్రిక గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సీపీఎం మండల కార్యదర్శి ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రామయ్య, జోగయ్య, నాయకులు పాల్గొన్నారు.

పల్లె రహదారులకు మోక్షం..

- ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.20 కోట్లు మంజూరు
- రెండు, మూడు రోజుల్లో టెండర్లు
- నెల రోజుల్లోపే పనులు ప్రారంభం
- ఆనందంలో కాలనీల ప్రజలు



దళితకాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్డు



గ్రామంలో సీసీ రోడ్డు వేయిస్తున్న అధికారులు(ఫైల్)

ఎర్రుపాలెం: మధిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 26 గ్రామాల రోడ్లను సీసీలుగా మార్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో స్థానికంగా దళితులు ఎదుర్కొంటున్న రోడ్ల సమస్యలకు పరిష్కారం దొరకనుంది. వర్షాకాలం వచ్చిందంటే చాలు పలు గ్రామాలోని దళితవాడల్లో నేటికి బురదమయంగా కనిపిస్తున్నాయి. దళితవాడల అభివృద్ధికై డిప్యూటీ సీఎం, స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గ పరిధిలోని ప్రతి మండలానికి రూ.4 కోట్ల చొప్పున మొత్తం 26 గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణం చేసేందుకు గానూ రూ.20 కోట్ల నిధులు మంజూరు చేశారు. దీంతో దళిత పల్లెలకు సీసీ రోడ్లు అందుబాటులోకి రానున్నాయి.

గ్రామాల వారీగా వివరాలిలా..

మధిర మండలంలోని సిరిపురం గ్రామానికి రూ.1.70 కోట్లు, నిదానపురం గ్రామానికి రూ.88 లక్షలు, మహాదేవపురం కాలనీకి రూ.1.42 కోట్లు నిధులు కేటాయించారు. ఎర్రుపాలెం మండలంలోని బనిగండ్లపాడు గ్రామానికి 1.75 కోట్లు, పెద్దగోపవరంకు రూ.85లక్షలు, అయ్యవారిగూడెం గ్రామానికి రూ.55 లక్షలు, బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి రూ.40 లక్షలు, , ఎర్రుపాలెం మండలకేంద్రానికి రూ.45లక్షలు కేటాయించారు. బోనకల్ మండలంలోని రావినూతలకు రూ.1.62 కోట్లు, చిరునోముల గ్రామానికి రూ.1.72 కోట్లు, , తూటికుంట్లకు రూ.66 లక్షల నిధులు , ,చింతకాని మండలంలో తిమ్మినేనిపాలెంకు రూ.36 లక్షలు, , నర్సింహాపురంకు రూ. 62లక్షలు, నాగిలిగొండకు 18లక్షలు, చింతకాని మండలకేంద్రానికి రూ85లక్షలు, పాతర్లపాడుకు రూ.45లక్షలు కోమట్లగూడెం గ్రామానికి రూ.70లక్షలు,,ముదిగొండ, మండలంలోని గోకినిపల్లికి రూ 44లక్షలు, పెద్దమండవకు రూ.58.5లక్షలు, వల్లబికి రూ.41.5లక్షలు, ముదిగొండ మండలకేంద్రానికి రూ.59.5లక్షలు, మాదారానికి రూ. 31లక్షలు, యడవల్లి గ్రామానికి రూ.68లక్షలు, వల్లాపురంకు రూ.63.5లక్షలు, సువర్ణాపురం గ్రామానికి రూ .34లక్షల నిధులు కేటాయింపు చేశారు. ఒక్కసారే పెద్ద మొత్తంలో సీసీ రోడ్లకు నిధులు కేటాయింపు చేయడంతో ఆయా గ్రామాల దళితుల ముఖాల్లో ఆనందం కనిపిస్తుంది.

వర్షాకాలంలో బురదమయం..



ఇదివరకు వర్షాకాలం వచ్చిందటే చాలు బురదలోనే నడవాల్సి వచ్చేది. దశాబ్దాలుగా ఇదే సమస్య వేధిస్తుంది. ప్రభుత్వం సమస్య తొలగిపోయేలా ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేసి.. రోడ్లు వేయడంతో చాలా సంతోషంగా ఉంది.

– మామిళ్ల బాబు, మత్కేపల్లి

టెండర్లు పిలుస్తాం..

నియోజకవర్గ వ్యాప్తంగా 26 గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి గానూ ప్రభుత్వ నిబంధనల మేరకు రెండు, మూడు రోజుల్లో టెండర్లు పిలుస్తాం. నెల రోజుల్లోపే పనుల్లో క్వాలిటీ ఉండేలా సీసీ రోడ్ల నిర్మాణాలు కూడా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. సీసీ రోడ్ల నిర్మాణాలతో గ్రామస్తులకు ఇబ్బందులు తొలుగుతాయి.

– వెంకట కోటేశ్వరరావు, డీఈ, పీఆర్

ఆర్థిక సాయం..

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం కిష్టారం ఓపెన్‌కాస్టులో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పని చేస్తున్న పనెం వెంకటేశ్వర్లు, టి.చిన్నకృష్ణ, టి.రమేష్‌లకు అనారోగ్యానికి గురై కుటుంబ పోషణ భారంగా మారటంతో కిష్టారం ఓసీ అధికారులు సోమవారం చేయూతనందించారు. పీఓ నర్సింహారావు, మేనేజర్ బి.రామకృష్ణ ఆధ్వర్యాన అధికారులు, ఉద్యోగులు విరాళాలు సేకరించి బాధితులకు ఆర్థిక సాయంతో సాటే నిత్యావసర సరుకులు అందించారు. అదనపు మేనేజర్ వి.బాబు, సర్వే అధికారి శ్రీనివాస్, సూర్యప్రకాష్, వీరప్రసాద్, అభినాష్, మాధవరావు, విక్రమ్, కిషోర్, వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్నేహితుడికి చిన్ననాటి మిత్రులు..

కల్లూరు: కల్లూరు పట్టణం కప్పలబంధం రోడ్‌లో నివాసముంటున్న చేవల సీత అనారోగ్యానికి గురికాగా ఆమె చిన్ననాటి మిత్రులు సోమవారం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.12 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో యాకూబ్ మియా, చింతపల్లి రాంబాబు, ఆసిఫ్, జావీద్, ఆది, నరసింహారావు, ఏనుగుల అంజి పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం

మధిర: స్థానిక మదర్ థెరిస్సా మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. సిరి మెడికల్స్ యజమాని కటికల శివారెడ్డి – సుమతి దంపతుల కుమారుడు ఫర్నిత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాసదనం నిర్వాహకులు నల్లపు స్వర్ణలత పాల్గొన్నారు.

తెలగారంలో చేతిపంపు ప్రారంభం

తల్లాడ: మండలంలోని తెలగారం గ్రామంలో ఏర్పాటు చేసిన మంచినీటి చేతిపంపును సోమవారం సీడీఎ కార్యదర్శి, ఏఐసీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఏనోష్‌కుమార్ ప్రారంభించారు. సెంటర్ డెవలప్‌మెంట్‌యాక్షన్ సంస్థ ఆధ్వర్యంలో రూ.80 వేలుతో చేతిపంపును గ్రామంలో ఏర్పాటు చేశారు. డేవిడ్ రాజు, టి.ఎబినేజర్, జాన్, పరంజ్యోతి, సుందర్‌రాజు, తిమోతి పాల్గొన్నారు.

పెద్దగోపతిలో షార్ట్‌ఫిల్మ్ చిత్రీకరణ

కొణిజర్ల: పెండ్లి కన్నా తమకు కేరీర్ ముఖ్యమని సరైన సమయంలో పెండ్లి చేసుకోకుండా ఉండే పిల్లల తల్లిదండ్రుల అంతర్మథనాన్ని తెలిపే కథతో రూపొందుతున్న ఈ తరం షార్ట్‌ఫిల్మ్ మండలంలోని పెద్దగోపతి గ్రామంలో ప్రారంభించారు. ప్రముఖ కమెడియన్ వాఖ్యాత మొగిలి గుణకర్, సహజ నటి వైదేహి ప్రధాన పాత్రదారులుగా, రవి తోప్ కో డైరెక్టర్‌గా, డీఓపీగా జి.ఉదయ్, ప్రొడక్షన్ మేనేజర్‌గా నాగసాయి వ్యవహరిస్తున్న ఈ షార్ట్ ఫిల్మ్‌కు కథ, రచన దర్శకత్వం, మొగిలి గుణకర్ వ్యవహరిస్తున్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.
జి. శ్రీనివాస్, ACM - 70754 60585 రమేష్, ACO-9059115968
ఖమ్మం ఎస్. ఉపేందర్ - 99591 24151 మధిర ఎస్.కె. సైదులు - 90524 34278
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 సత్తుపల్లి జి. బాబు - 79979 58225
వైరా ఐ. రాందాస్ - 98898 81843 టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083
సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24
మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600
రవికుమార్ - 99499 27792
ఎస్. జయరాజు - 96528 68642